# ఆదిలాబాద్ వార్త



మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

గురువారం 7, మే 2026


## గోదాములను తనిఖీ చేసిన కలెక్టర్

సారంగాపూర్, మే 06, ప్రభాతవార్త



మండలంలోని మార్కెట్ యార్డ్ లో గల ఏఎంసి గోదాములను వరి ధాన్యం నిలువ కోసం జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా బుధవారం తనిఖీ చేశారు. వరి ధాన్యం కొనుగోళ్ల ప్రారంభమైన నేపథ్యంలో ధాన్యాన్ని భద్రపరిచేందుకు గోదాములు సిద్ధంగా ఉన్నాయా లేదా అని అధికారులను అడిగి తెలుసుకున్నారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని నిలువ సామర్థ్యంపై అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం మొక్కజొన్న కొనుగోలు విధానంపై వివరాలు ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, ఎంపీడీవో లక్ష్మీకాంత్, మార్కెట్ సీఈవో నావవత్, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

# అకాల వర్షానికి నలుగురు రైతులు మృతి




మృతిచెందిన నాగరాజు, అభిరాం




వెంకటేష్, లచ్చన్న (ఫైల్ ఫోటోలు)





- ✶ లక్షెట్టిపేట మండలంలో వేర్వేరు సంఘటనలో నలుగురు మృతి
- ✶ మరో నలుగురికి గాయాలు
- ✶ రేకుల షెడ్డు కూలి తండ్రి కొడుకు మృతి
- ✶ గోడ కూలి మరో ఇద్దరు మృతి
- ✶ మృతుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలి : మాజీ మంత్రి జీవన్‌రెడ్డి
- ✶ రహదారిపై రాస్తారోకో స్థంభించిన రాకపోకలు
- ✶ కలెక్టర్, డీసీపీల హామితో రాస్తారోకో విరమణ

లక్షెట్టిపేట, మే6, ప్రభాతవార్త

మంచిర్యాల జిల్లాలోని లక్షెట్టిపేట మండలంలో మంగళవారం అర్ధరాత్రి అకాల వర్షానికి నలుగురు రైతులు మృతి చెందారు.అలాగే మరో నలుగురికి తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. మున్సిపాలిటి పరిధిలోని గంపలపల్లికి చెందిన తనుగుల నాగరాజు (50), తనుగుల అభిరాం (22) అనే తండ్రి కొడుకులు వరి ధాన్యం వర్షానికి తడవకుండా కప్పే ప్రయత్నంలో భారి గాలి వానకు రేకుల షెడ్డు కూలి దుర్మరణం చెందడం జరిగింది. మరో సంఘటనలో దండేపల్లి మండలం ముత్యంపేటకు చెందిన నిల్కి లచ్చన్న (55) తన కుమారున్ని హైదరబాద్‌కు బస్సు ఎక్కించి తిరుగు ప్రయాణంలో కొత్తూరు స్టేజివద్ద వర్షానికి తలదాచుకోవడానికి ఒక షెడ్డు వద్ద ఆగగా, అక్కడే కొత్తూరు గ్రామానికి చెందిన గుండారపు వెంకటేష్ (24) వరిధాన్యాన్ని తడవకుండా కవర్ కప్పి తలదాచుకోవడానికి ఆదే షెడ్డు కిందకు చేరుకున్నాడు. తీవ్రగాలీ దుమారంతో షెడ్డు కూలి లచ్చన్న, వెంకటేష్‌లు అక్కడికక్కడే మృతి చేందారు. దీంతో మృతుల కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది. జిల్లాలో విషాదచాయలు అలుముకున్నాయి.

2 లో..

### పిడుగుపాటుకు

## వరి ధాన్యం కుప్ప దగ్ధం

పెంచికల్ పేట్, మే 6, ప్రభాతవార్త



మంగళవారం రాత్రి కురిసిన అకాల వర్షం రైతులకు తీవ్ర నష్టాన్ని మిగిల్చింది. అమ్మకానికి సిద్ధగా అరబెట్టిన వరిధాన్యం వర్షానికి తడిసిపోయింది. మండలంలోని ఎల్కపల్లి శివారులో రైతు జర్పుల శ్యామ్ కు చెందిన సుమారు 2 ఎకరాల వరి ధాన్యం కుప్పపై పిడుగు పడటంతో అది పూర్తిగా దగ్ధమైంది. రైతు కష్టపడి సాగు చేసిన ధాన్యం క్షణాల్లోనే కాలిపోవడంతో భారీ నష్టం సంభవించింది. సంఘటనపై సమాచారం అందుకున్న రెవెన్యూ సిబ్బంది బుధవారం ఘటన స్థలానికి చేరుకొని పరిస్థితిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్ఐ రాజేశ్వర్, జీపీవో అనిల్ పంచనామా నిర్వహించి నష్టాన్ని అంచనా వేశారు. ప్రభుత్వం తక్షణమే నష్టపరిహారం అందించాలని రైతు శ్యామ్ వేడుకొన్నారు.

## వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలి: నిర్మల్ జిల్లా కలెక్టర్

చింతలమానేపల్లి, మే 06, ప్రభాతవార్త

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో విధులు నిర్వహించే వైద్య సిబ్బంది సమయపాలన పాటించి, వైద్యం కోసం వచ్చే ప్రజలకు, నాణ్యమైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. బుధవారం మండల పరిదిలోని రవీంద్రనగర్ గ్రామంలో గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ అకస్మికంగా తనిఖీ చేశారు. హాజరు రిజిస్టర్, మందుల నిలువ గది, వార్డులు, ఆసుపత్రి పరిసరాలను పరిశీలించారు. ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగికి సమయానికి మిగతా 2లో..





## ఇంధన ధరల పెంపుపై మండిపాటు..

- ◆ మందమర్రిలో సీపీఐ నిరసన..
- ◆ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై మండిపడ్డ నాయకులు

మందమర్రి, మే 06, ప్రభాతవార్త

భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గ్యాస్, డీజిల్, పెట్రోల్ ధరల పెంపును నిరసిస్తూ మే 6న రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన ఆందోళనల్లో భాగంగా మందమర్రి పట్టణంలో నిరసన ధర్నా చేపట్టారు. జిల్లా వ్యాప్తంగా మండల, పట్టణ కార్యదర్శులు, జిల్లా సమితి సభ్యులు, ప్రజా సంఘాల నాయకుల సమన్వయంతో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ ధర్నాలో సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, జిల్లా కార్యవర్గ సభ్యులు భీమనాథుని సుదర్శన్ పాల్గొని మాట్లాడుతూ, రాష్ట్రంలో గ్యాస్, డీజిల్, పెట్రోల్ అధిక ధరలు, కొరత కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. ప్రస్తుతం పంట కోతల సమయంలో డీజిల్ కొరతతో మిగతా 2లో..

## అకాల వర్షానికి నలుగురు రైతులు మృతి

(మొదటిపేజీ తరువాయి)

కాగా మృతుల కుటుంబాలను మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేంసాగర్ రావు పరమార్శించి తనవంతుగా తక్షణ సహాయం క్రింద మృతులకు ఒక్కొకరికి రూ.2లక్షల ఆర్థిక సహాయాన్ని ప్రకటించారు.

### మృతుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలి..

ఈ సమాచారం తెలుసుకున్న మాజీ మంత్రి బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవన్ రెడ్డి, మంచిర్యాల మాజి ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు ఆధ్వర్యంలో బుధవారం లక్షెట్టిపేట మండల కేంద్రంలోని ఉత్కూరు చౌరస్తా రహదారిపై మృతుల కుటుంబీకులతో మృతి చెందిన రైతుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని రస్తారోఖో చేశారు. తక్షణమే మృతిచెందిన ఒకోక్కరికి రూ.50లక్షల పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న జాయింట్ కలెక్టర్ వి రాములు, డీసీసీ భాస్కర్, సంఘటన స్థలానికి చేరుకుని చరవాణి ద్వారా కలెక్టర్ హామితో ఆందోళనను విరమింప జేశారు.

## వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలి: నిర్మల్ జిల్లా కలెక్టర్

(మొదటిపేజీ తరువాయి)

సరైన చికిత్స అందేలా వైద్య సిబ్బంది కృషి చేయాలని అన్నారు. ఎండల తీవ్రత దృష్ట్యా ఆసుపత్రిలో సరిపడా ఓ.ఆర్.ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని, ఎండదెబ్బ తగిలిన వారికి వెంటనే చికిత్స అందించాలని తెలిపారు. ఆరోగ్య కార్యకర్తలు, ఆశా వర్కర్లు, సూపర్వైజర్లు తమ పరిధిలోని గ్రామాలను ప్రతిరోజు సందర్శించి, గర్భిణీలు బాలింతల ఆరోగ్య పరిస్థితిని పర్యవేక్షిస్తూ, వారికి అందిస్తున్న వైద్య సేవల వివరాలను నమోదు చేయాలని అన్నారు. ప్రజలకు ఎండల ప్రభావంపై అవగాహన కల్పించాలని సూచించారు. అలాగే, అవసరమైన మందులను నిల్వలను అందుబాటులో ఉంచాలని అన్నారు, ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. సిబ్బంది సమయపాలన పాటించాలని అన్ని అన్నారు విదులకు ఆలస్యంగా వచ్చే వారి పై చర్యలు తిసుకుంటమన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, సిబ్బంది, పాల్గొన్నారు. అనంతరం మండలంలోని దిందా గ్రామ సమీపంలో గల ప్రాణహిత నదిని పరిశీలించారు. నదిలో నీటి ప్రవాహ వివరాలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. దిందా గ్రామ సమీపంలోని వాగుపై నిర్మాణంలో ఉన్న హై లెవెల్ వంతెన పనులను పరిశీలించారు పనులను నాణ్యతతో చేపట్టాలన్నారు, పనులను త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్ ను ఆదేశించారు. ఇంజనీరింగ్ అధికారులు ప్రతిరోజూ పనులను పర్యవేక్షించాలని సూచించారు. ఈ వంతెన నిర్మాణం పూర్తయితే గ్రామస్తులు చాల కాలం నుండి ఎదురుకుంటున్న రవాణా సమస్య తీరిపోతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సంబందిత శాఖల అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఇంధన ధరల పెంపుపై మండిపాటు..

(మొదటిపేజీ తరువాయి)

రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, కొరత లేదని పాలకులు ప్రకటిస్తున్నప్పటికీ ప్రజలు పడుతున్న ఇబ్బందులను పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఐదు రాష్ట్రాల ఎన్నికలు ముగిసిన వెంటనే కేంద్ర ప్రభుత్వం వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధరలను భారీగా పెంచి రూ.3,100కు చేర్చిందని, అలాగే డీజిల్, పెట్రోల్ లీటరుకు రూ.5, గృహావసరాల గ్యాస్ సిలిండర్పై రూ.50 పెంపునకు ఆయిల్ కంపెనీలు ప్రతిపాదనలు పంపాయని పేర్కొన్నారు. ఇంధన ధరల పెంపు వల్ల వ్యాపార, వాణిజ్య, హోటల్ రంగాలపై తీవ్ర ప్రభావం పడటంతో పాటు మధ్యతరగతి, పేద ప్రజలపై అదనపు భారం పడే అవకాశం ఉందన్నారు. దీంతో నిత్యావసర సరుకుల ధరలు కూడా పెరిగే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. పెంచిన గ్యాస్, డీజిల్, పెట్రోల్ ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం యుద్ధాల సాకుతో చమురు నిల్వలను బ్లాక్ చేస్తూ దళారులకు కొమ్ముకాస్తోందని ఆరోపించిన నాయకులు, పెట్రోలు, డీజిల్ ధరల పెంపు ప్రతిపాదనలను వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. పట్టణ కార్యదర్శి కామెరా దుర్గారాజు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పార్టీ, ప్రజా సంఘాల నాయకులు బండారి రాజేశం, రాళ్లపల్లి వీరయ్య, ఎండి రసూల్, నరేష్, మహిళా సంఘం నాయకురాలు బియ్యాల పద్మ, మహిళా కార్యకర్తలు తదితరులు పాల్గొని విజయవంతం చేశారు.

## పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడిగా సయ్యద్ షాహిద్ అలీ

**లక్షెట్టిపేట, మే 06, ప్రభాతవార్త**



లక్షెట్టిపేట కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షునిగా నియమితులైన సయ్యద్ షాహిద్ అలీ నియమితులయ్యారు. పార్టీ కోసం అహర్నిశలు పనిచేసే వ్యక్తికి ఈ పీఠం దక్కినందుకు మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు, మాజీ డిసిసి అధ్యక్షులు కొక్కిరాల సురేఖకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. అనంతరం నూతన అధ్యక్షుడు షాహిద్ అలీ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధిష్టానం నాపై నమ్మకంతో నాకు ఈ అవకాశం ఇచ్చిన ఎమ్మెల్యేకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే రాబోవు రోజుల్లో పార్టీ బలోపేతానికి, పట్టణ కాంగ్రెస్ కార్యకర్తలకు ఎల్లవేళలా అండగా ఉండి వాళ్ళ సమస్యలను దగ్గరుండి తీరుస్తానని పట్టణ ప్రజలకు ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పట్టణంలో బాణాసంచా కాల్చి మిఠాయిలు పంచి పెట్టారు.

# రైతన్నను నిండా ముంచిన గాలివాన..

✳ నేల రాలిన మామిడి, వరదలకు కొట్టుకుపోయిన వడ్ల కుప్పలు ✳ చెరువులను తలపిస్తున్న కొనుగోలు కేంద్రాలు

✳ ఆరుగాలం కష్టం వర్షార్పణం ✳ కొనుగోలు సెంటర్ల వద్ద అన్నదాతల ఆర్తనాదం

**చెన్నూరు, మే 6, ప్రభాతవార్త**



నిత్యం ప్రకృతి ఒడిలో ఉండే రైతన్న ఆరుగాలం శ్రమించి పండించిన పంటలను అదే ప్రకృతి వైపరిత్యంతో కురిసిన గాలివానకు కొట్టుకు పోతుంటే చేసేదేమీలేక గుండెలోని దుఃఖాన్ని వర్షానికి తోడుగా కన్నీరు కార్చాడు. జిల్లాలోని చెన్నూరు నియోజకవర్గ వ్యాప్తంగా మంగళవారం రాత్రి కురిసిన గాలివానకు మామిడి, వరి పంటలు చాలా దెబ్బతిన్నాయి. మామిడి కాయలు నేలరాలి మామిడి రైతుకు అపార నష్టాన్ని మిగిల్చింది. కొనుగోలు కేంద్రాలు చెరువులను తలపిస్తున్నాయి. కొనుగోలు ఇప్పటి వరకు ప్రారంభం కాకపోవడంతో గాలివాన వరదలకు వడ్లు కొట్టుకుపోయాయి. వర్షాలు పడుతున్నా కొనుగోలు మొదలు పెట్టకపోవడంతో రైతులు మండిపడుతున్నారు. తడిసిన ధాన్యాన్ని ఎలాంటి కోతలు లేకుండా కొనుగోలు జరపాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

## ప్రభుత్వ పథకాల లబ్ధి కోసం అభ్యర్థుల ఇంటర్వ్యూలు

**మందమర్రి, మే 06, ప్రభాతవార్త**



మందమర్రి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో షెడ్యూల్డ్ కులాల సేవా సహకార సంస్థ ద్వారా లబ్ధి పొందేందుకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో భాగంగా అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేసే ప్రక్రియలో ఈ ఇంటర్వ్యూలు చేపట్టారు. ఈ సందర్భంగా దరఖాస్తుదారుల అర్హతలు, పథకం ద్వారా పొందే ప్రయోజనాల వినియోగం, ఆర్థిక స్థితిగతులు తదితర అంశాలపై అధికారులు, బ్యాంకు ప్రతినిధులు వివరాలు సేకరించారు. ఇంటర్వ్యూలకు ఎస్బీఐ కళ్యాణిఖని, ఎస్బీఐ యాపల్, తెలంగాణ గ్రామీణ బ్యాంక్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా శాఖల మేనేజర్లు హాజరై అభ్యర్థులతో మాట్లాడి వారి దరఖాస్తులను పరిశీలించారు. అలాగే ఎంపీఓ, షెడ్యూల్డ్ కులాల సేవా సహకార సంస్థ ప్రతినిధులు కూడా పాల్గొని ఎంపిక ప్రక్రియను పర్యవేక్షించారు. అర్హులైన అభ్యర్థులను పారదర్శకంగా ఎంపిక చేసి, ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో దరఖాస్తుదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పంట కొనుగోళ్లలో నిర్లక్ష్యాన్ని వీడాలి రైతు కుటుంబాలకు న్యాయం చేయాలి

### - ఎంసిపిఐయు పార్టీ డిమాండ్

**బెల్లంపల్లి, మే 06, ప్రభాతవార్త**



పంట కొనుగోళ్ల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రదర్శిస్తున్న నిర్లక్ష్య ధోరణిని వెంటనే విడనాడాలని ఎంసిపిఐయు పార్టీ మంచిర్యాల జిల్లా సహాయ కార్యదర్శి పసులేటి వెంకటేష్ డిమాండ్ చేశారు. బుధవారం రోజున బెల్లంపల్లి కొత్త బస్టాండ్లోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మంచిర్యాల జిల్లా లక్షెట్టిపేట మండలంలో ఇటీవల చోటుచేసుకున్న విషాద ఘటనలో పలువురు రైతులు మృతి చెందడం తీవ్రంగా బాధాకరమని ఆయన అన్నారు. ప్రభుత్వం సమయానికి పంట కొనుగోళ్లు పూర్తి చేసి ఉంటే ఈ పరిస్థితి ఎదురయ్యేదే కాదని పేర్కొన్నారు. పంట కొనుగోళ్లు ఆలస్యమవడంతో రైతులు అకాల వర్షాల కారణంగా పంటను కాపాడుకునే ప్రయత్నంలో ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనలో మృతి చెందిన గండారపు వెంకటేష్, తనుగుల అభిరామ్, విలికీల లచ్చన్న, తనుగుల నాగరాజు కుటుంబాలను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ప్రతి కుటుంబానికి రూ.50 లక్షల ఎక్స్గ్రేషియా చెల్లించడంతో పాటు, ఒక్కొక్క కుటుంబానికి ఒక ప్రభుత్వ ఉద్యోగాన్ని కల్పించాలని కోరారు. ఇకపై ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు పంట కొనుగోళ్ల ప్రక్రియను తక్షణమే పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు విజ్ఞప్తి చేశారు. లేనిపక్షంలో మంచిర్యాల జిల్లా వ్యాప్తంగా రైతులను ఏకతాటిపైకి తెచ్చి జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట భారీ ధర్నా చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో దుర్గం లక్ష్మి, రాజ్‌కుమార్, సబ్బని రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణి కార్మికులను మళ్లీ మోసం చేసే కుట్రలు ఆపాలి

### - విప్లవ కార్మిక సంఘాల ఆగ్రహం

**బెల్లంపల్లి, ప్రభాతవార్త**




సింగరేణి కార్మికులను మరోసారి మోసం చేయడానికి జాతీయ కార్మిక సంఘాలు కుట్రలు పన్నుతున్నాయని విప్లవ కార్మిక సంఘాల నాయకులు తీవ్రంగా ఆరోపించారు. సింగరేణిలో కార్మికుల ఓట్లతో గెలిచిన గుర్తింపు సంఘం ఏఐటీయూసీ, ప్రాతినిధ్య సంఘాలు ఇప్పటివరకు కార్మికులకు గణనీయమైన ప్రయోజనాలు సాధించలేదని విమర్శించారు. సింగరేణి ఎన్నికల ప్రక్రియ సమీపిస్తున్న నేపథ్యంలో మళ్లీ కార్మిక వర్గాన్ని మభ్యపెట్టి గెలవాలనే ప్రయత్నాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. గతంలో టీజీబీకేఎస్ సాధించిన ఫలితాలపై కూడా కార్మిక వర్గం ప్రశ్నిస్తోందని తెలిపారు. జేబీసీసీఐలో కుదిరిన ఒప్పందాలపై కార్మిక సంఘాల పాత్రపై అనుమానాలు వ్యక్తం చేశారు. ఇటీవల సింగరేణి సి అండ్ ఎండి కారుణ్య నియామకాల పేరిట ఉద్యోగాలు ఇస్తామని, కానీ అవి అవుట్సోర్సింగ్ విధానంలో ఉంటాయని ప్రకటించడం సిగ్గుచేటని అన్నారు. దీనిని వ్యతిరేకించాల్సిన జాతీయ కార్మిక సంఘాలు మౌనం వహించడం కార్మికుల పట్ల వారి వైఖరిని బహిర్గతం చేస్తోందని విమర్శించారు. అదేవిధంగా గోల్డెన్ షేక్ హ్యాండ్, వీఆర్ఎస్ వంటి పథకాల పేరుతో కార్మికులను మోసగిస్తున్నారని, వన్ టైం సెటిల్మెంట్ వంటి విధానాలు కార్మికులకు నష్టదాయకమని తెలిపారు. ఈ విధానాలను అడ్డుకోవడంలో జాతీయ కార్మిక సంఘాలు పూర్తిగా విఫలమయ్యాయని ఆరోపించారు. దేశవ్యాప్తంగా ప్రైవేటీకరణ, కాంట్రాక్టు విధానాలు పెరుగుతున్న నేపథ్యంలో కార్మిక హక్కులను రక్షించడంలో జాతీయ సంఘాలు వైఫల్యం చెందాయని అన్నారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అమలు చేస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను ఎదుర్కోవడానికి బలమైన కార్మిక ఉద్యమం అవసరమని పిలుపునిచ్చారు. ఇప్పటికైనా సింగరేణిలో గెలిచిన సంఘాలు, జాతీయ కార్మిక సంఘాలు కలిసి రాష్ట్ర ప్రభుత్వంతో చర్చలు జరిపి కేంద్రం ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ కోడ్లను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేయాలని విప్లవ కార్మిక సంఘాలు జేఏసీ కోరింది. ఈ కార్యక్రమంలో సింగరేణి గని కార్మిక సంఘం (ఎస్‌జికేఎస్) రాష్ట్ర నాయకులు అంబాల మహేందర్, శ్రామిక శక్తి గోదావరి లోయ బొగ్గు గని కార్మిక సంఘం (ఏఐఎస్టియు) రాష్ట్ర కార్యదర్శి ఎం. పోషమల్లు, టీయూసీఐ రాష్ట్ర నాయకులు గోగర్ల శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## రైతు సంక్షేమంలో భాగంగా వరిధాన్యం కొనుగోలు: కలెక్టర్

**జైపూర్, మే 6, ప్రభాతవార్త**

రైతు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల ద్వారా నిబంధనల ప్రకారం రైతుల వద్ద నుండి వరి ధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జైపూర్ మండలం టేకుమట్ల, ఇందారం, షెట్ పల్లి, నర్సింగాపూర్ గ్రామాలలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించి ధాన్యం కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైతు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధర చెల్లించి రైతుల వద్ద నుండి వరి ధాన్యం కొనుగోలు చేస్తుందని తెలిపారు. అకాల వర్షాల నేపథ్యంలో తడిసిన ధాన్యాన్ని త్వరగా ఆరబెట్టి రైస్ మిల్లులకు తరలించాలని, రైతులు ధాన్యాన్ని నిబంధనల ప్రకారం కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని, రైతుల సౌకర్యార్థం కొనుగోలు కేంద్రాలలో త్రాగునీరు, నీడ సౌకర్యాలు కల్పించడంతో పాటు తూకం యంత్రాలు, ప్యాడి క్లీనర్లు ఇతర సదుపాయాలు కల్పించాలని తెలిపారు. రైతు వివరాలను సిస్టం లో నమోదు చేసి ఆధార్ కార్డు ద్వారా వారి గుర్తింపును ధృవీకరించాలని, రైతు భూమి విస్తీర్ణం, పండించిన ధాన్యం వివరాలను సరి చూడాలని, ధాన్యం నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా ఉండే విధంగా పరిశీలించాలని తెలిపారు. కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించి రైతుల బ్యాంకు ఖాతాలలో నగదు జమ చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.


పిఏసిఎస్ చైర్మన్లుగా బాధ్యతలు స్వీకరించిన అయిర నారాయణరెడ్డి, మాణిక్‌రెడ్డి

## పీఏసీఎస్ చైర్మన్లుగా బాధ్యతల స్వీకరణ

**సారంగాపూర్, మే 06, ప్రభాతవార్త:**

మండలంలోని కౌట్ల(బి) పీఏసీఎస్ చైర్మన్‌గా అయిర నారాయణరెడ్డి, ఆలూరు పీఏసీఎస్ చైర్మన్ గా మాణిక్ రెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల పదవీకాలం ముగియడంతో, ప్రభుత్వం తిరిగి పాత చైర్మన్లకే బాధ్యతలు అప్పగించింది. వీరితో పాటు డైరెక్టర్లు కూడా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా చైర్మన్లు మాట్లాడుతూ.. వరి, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా త్వరితగతిన కొనుగోళ్లు పూర్తి చేస్తామన్నారు. రైతులకు సకాలంలో రుణాలు అందేలా కృషి చేస్తామని తెలిపారు. బాధ్యతలు స్వీకరించిన చైర్మన్లను నాయకులు, రైతులు, సీఈఓలు అభినందించారు.


స్టీల్ బ్యాంకును ప్రారంభిస్తున్న సర్పంచ్ కోనేరు భూమన్న, ఎంపీఓ అజీజ్ ఖాన్

## ప్లాస్టిక్ రహిత గ్రామం కోసం స్టీల్ బ్యాంక్ ఏర్పాటు

**సారంగాపూర్, మే 06, ప్రభాతవార్త:**

ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి పర్యావరణాన్ని కాపాడాలనే లక్ష్యంతో మండల కేంద్రంలో సర్పంచ్ కోనేరు భూమన్న స్టీల్ బ్యాంకును ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీఓ అజీజ్ ఖాన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శుభకార్యాల్లో ప్లాస్టిక్ ప్లేట్లకు బదులుగా స్టీల్ ప్లేట్లు వాడాలని సూచించారు. ప్లాస్టిక్ వల్ల మానవ మనుగడతో పాటు వన్యప్రాణులు, భూసారం దెబ్బతింటుందని పేర్కొన్నారు. సర్పంచ్ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమం అభినందనీయమన్నారు. మిత్ర టింబర్ డిపో వారు అందజేసిన సంచులను గ్రామస్తులకు పంపిణీ చేసి, ఇంటింటికి చెత్త బుట్టలను అందజేశారు. కిరాణా షాపుల్లో ప్లాస్టిక్ సంచులు, ప్లేట్లు అమ్మకూడదని యజమానులకు వినతి పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ కృష్ణారెడ్డి, పంచాయతీ కార్యదర్శి కృష్ణ, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

## ప్రజావాణికి విశేష స్పందన: సమస్యల పరిష్కారానికి ఎస్పీ ఆదేశం

**భైంసా, మే 06, ప్రభాతవార్త**

భైంసా పట్టణంలోని ఎస్పీ క్యాంపు కార్యాలయంలో బుధవారం నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమానికి బాధితులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. జిల్లా ఎస్పీ డాక్టర్ జానకి షర్మిల బాధితుల సమస్యలను ఓర్పుతో విని ఫిర్యాదులను స్వీకరించారు. భైంసా సబ్ డివిజన్ వ్యాప్తంగా 16 మంది ఫిర్యాదుదారులు తమ సమస్యలను విన్నవించారు. వీటిపై తక్షణమే స్పందించిన ఎస్పీ, సంబంధిత అధికారులకు ఫోన్ చేసి విచారణ జరపాలని, బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమస్యల పరిష్కారంలో ఆలస్యం లేకుండా పనిచేయాలని సూచించారు. నేరుగా ఫిర్యాదు చేసే అవకాశం కల్పించిన ఎస్పీకి బాధితులు కృతజ్ఞతలు తెలిపారు.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న జిల్లా ఎస్పీ డాక్టర్ జానకి షర్మిల

### నార్లాపూర్ సమస్యలపై

# మున్సిపల్ అధికారులకు వినతిపత్రం

**- సానుకూలంగా స్పందించిన కమిషనర్ రాజలింగు**

**మందమర్రి, మే 6, ప్రభాతవార్త:**


కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న పెద్దపెల్లి సత్యనారాయణ

మందమర్రి మున్సిపాలిటీ పరిధిలోని నార్లాపూర్ ఆరవ వార్డుకు సంబంధించిన పలు ప్రజా సమస్యల పరిష్కారం కోసం మున్సిపల్ కమిషనర్ తుంగపిండి రాజలింగు, మున్సిపల్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎం. సుమతికి స్థానిక నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నార్లాపూర్ వార్డు ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా గోదావరి వాటర్ ఇంటింటి నల్ల కనెక్షన్ బిల్లులు అధికంగా వస్తున్న నేపథ్యంలో బిల్లుల్లో మినహాయింపు కల్పించాలని కోరారు. అలాగే ఇప్పటికే మంజూరైన సీసీ రోడ్డు పనులను తక్షణమే ప్రారంభించి పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. నార్లాపూర్‌లో ప్రతిరోజూ గోదావరి నీటి సరఫరా అందేలా చర్యలు తీసుకోవాలని, అన్ని వార్డులకు సమానంగా వాటర్ సప్లై జరిగేలా చూడాలని కోరారు. గత కొంతకాలంగా చెడిపోయి ఉన్న బోర్‌వెల్స్, చేతి పంపులను మరమ్మతులు చేసి తిరిగి వినియోగంలోకి తీసుకురావాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. అదేవిధంగా డ్రైనేజీ వ్యవస్థను ఎప్పటికప్పుడు శుభ్రపరచాలని, కొత్తగా దరఖాస్తు చేసుకున్న వికలాంగులు, వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలకు పెన్షన్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయడంతో పాటు, మేడారం స్టేజీ నుంచి నార్లాపూర్ గేట్ వరకు అన్ని విద్యుత్ స్తంభాలకు వీధిలైట్లు ఏర్పాటు చేయాలని కోరారు. వినతిపత్రాన్ని స్వీకరించిన కమిషనర్ తుంగపిండి రాజలింగు సమస్యలపై సానుకూలంగా స్పందించారు. నార్లాపూర్ వార్డు సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి, వీలైనంత త్వరగా పరిష్కార చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వి.హెచ్.పి.ఎస్. జాతీయ నాయకులు, బీసీ కుల సంఘాల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షులు పెద్దపల్లి సత్యనారాయణ, బీసీ కుల సంఘాల ఐక్యవేదిక నాయకులు జడ కొమరయ్య, అరకటి రవీందర్ తదితరులు పాల్గొన్నారు.


ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ మహోత్సవంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి

## ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశంలో పాల్గొన్న విఠల్‌రెడ్డి

**భైంసా, మే 06, ప్రభాతవార్త:**

మండలంలోని భామిని గ్రామంలో సుమలత బాలాజీ నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ మహోత్సవానికి ముధోల్ మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, ఇన్చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావుకు, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగలేటి శ్రీనివాసరెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీ వైస్ చైర్మన్ రాజన్న, మాజీ ఆత్మ చైర్మన్ పోతారెడ్డి, ఉపసర్పంచ్ గంగాధర్, వార్డు సభ్యులు బాలాజీ, భోజరాం, డాక్టర్ లాల్ అన్న, శంకర్ సెట్, లక్ష్మణ్, సాహెబ్ రావు, రమేష్ పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుని కుటుంబానికి పీఆర్టీయూ ఎస్ చేయూత

**నిర్మల్, మే 06, ప్రభాతవార్త:**



ఇటీవల అకాల మరణం చెందిన మామడ మండలం కోర్టికల్ ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు డి. అంజయ్య కుటుంబానికి పీఆర్టీయూ ఎస్ రాష్ట్ర సంఘం తరపున లక్ష రూపాయల చెక్కును అందజేశారు. అంజయ్య పీఆర్టీయూ ఎస్ క్రియాశీల సభ్యుడు కావడంతో ఆయన సతీమణి లక్ష్మికి ఈ ఆర్థిక సాయాన్ని అందజేసినట్లు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టి. నరేంద్రబాబు, బి.వి. రమణారావు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంజయ్య కుటుంబానికి సంఘం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు కృష్ణ కిషోర్, రాజన్న, సత్తన్న, మన్మథ రెడ్డి, సాయన్న, శంకర్, పరమేశ్వర్, గజ్జరం, గంగాధర్, వినేష్, సంతోష్ పాల్గొన్నారు.

## పోచమ్మ ఆలయ విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొన్న ఆడే గజేందర్

**నేరడిగొండ, మే 06, ప్రభాతవార్త**



మండలంలోని తర్నం గ్రామంలో బుధవారం నిర్వహించిన పోచమ్మ ఆలయ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఆడే గజేందర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో గ్రామ ప్రజలతో కలిసి ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ గ్రామ అభివృద్ధికి ఎల్లప్పుడూ సహకరిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన మోహన్ రావు పాటిల్

**భైంసా, మే 06, ప్రభాతవార్త:**

భైంసా పట్టణంలో, పలు గ్రామాల్లో జరిగిన వివాహాది శుభకార్యాలకు ప్రజా ట్రస్ట్ చైర్మన్ భోస్లే మోహన్ రావు పాటిల్ బుధవారం హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన నూతన వధూవరులను ఆశీర్వదించి, వారి దాంపత్య జీవితం సుఖమయంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిగ్రీ కాలేజీ డెవలప్మెంట్ జనరల్ సెక్రటరీ మనోజ్ పాపిన్వార్, పలువురు నాయకులు పాల్గొన్నారు.


నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న భోస్లే మోహన్‌రావు పాటిల్

# వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలి

★ మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

నస్పూర్, మే 6, ప్రభాతవార్త



వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేసి రైతులకు నగదు చెల్లింపులు త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ ఛాంబర్‌లో పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ శ్రీకళ, పౌరసరఫరాల శాఖ అధికారులు, రవాణా గుత్తేదారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైతు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం చేపట్టిన వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేసి రైతులకు నగదు చెల్లింపు త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. జిల్లాలో కొనసాగుతున్న వరి కొనుగోలు ప్రక్రియలో రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సజావుగా కొనుగోలు పూర్తి చేయాలని తెలిపారు. జిల్లాలో గోదాములను తక్షణమే ప్రారంభించి, ప్రస్తుతం కొనుగోలు చేస్తున్న ధాన్యాన్ని నిల్వ చేయాలని ఆదేశించారు. జిల్లాలో ఇప్పటివరకు 10 రైస్ మిల్లులు పని చేస్తున్నాయని, సుముఖ్ గోదాం సామర్థ్యం 20 వేల మెట్రిక్ టన్నులు ఉండగా, ఇతర గోదాముల సామర్థ్యం మొత్తం 61 వేల మెట్రిక్ టన్నులుగా ఉందని తెలిపారు. ఈ సామర్థ్యాన్ని పూర్తిగా వినియోగిస్తూ నిల్వలను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. ప్రభుత్వం రైస్ మిల్లర్లకు మిల్లింగ్ చార్జీలు ఇప్పటికే విడుదల చేసినందున మిల్లర్లు ఆలస్యం చేయకుండా బిల్లుల ప్రకారం వరి ధాన్యం తీసుకుని మిల్లింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని తెలిపారు. మిల్లుల బ్యాంక్ గ్యారంటీలను సమీక్షించి, అర్హత ఉన్న మిల్లులకు వరి ధాన్యం విడుదల చేయాలని, జిల్లాలో మిల్లింగ్ సామర్థ్యాన్ని మరింత పెంచేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని, రవాణా వాహనాలను మిల్లులకు తగిన విధంగా కేటాయించి, వరి ధాన్యం రవాణా, అన్‌లోడింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. కొనుగోలు కేంద్రాలకు రైతులు తీసుకొచ్చే వరి తప్పనిసరిగా శుభ్రపరచి, నాణ్యత ప్రమాణాలను పాటించాలని తెలిపారు. ఈ సంవత్సరం జిల్లాలో సన్నాల సాగు 90 శాతానికి పైగా ఉన్నందున, కొనుగోలు పరిమాణాన్ని గత సంవత్సరాల కంటే మరింత పెంచే దిశగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. కొనుగోలు ప్రక్రియలో ఎటువంటి అంతరాయాలు రాకుండా, హమాలి సమస్యలు తలెత్తకుండా చూసుకోవాలని తెలిపారు. జిల్లాలో అందుబాటులో ఉన్న గోనె సంచులను మిల్లర్లు పరస్పర అవగాహనతో అవసరమైన చోట వినియోగించుకోవాలని, గోనె సంచుల కొరత ఎక్కడా లేకుండా చూసుకోవాలని తెలిపారు. కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు తమ బాధ్యతలను క్రమంగా నిర్వర్తిస్తూ, రైతుల నుంచి వరి ధాన్యం కొనుగోలును పారదర్శకంగా చేపట్టి సమయానికి పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లాలో వరి కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేసి, రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సకాలంలో చెల్లింపులు జరిగేలా సంబంధిత విభాగాల అధికారులు సమన్వయంతో పని చేయాలని తెలిపారు.

అనంతరం జిల్లా సహకార శాఖ అధికారులతో వరి ధాన్యం కొనుగోలు పై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. జిల్లాలో కొనసాగుతున్న వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను సమర్థవంతంగా, వేగవంతంగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. రైతులు కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చే ధాన్యాన్ని నాణ్యత ప్రమాణాలను పరిశీలించి కొనుగోలు చేయాలని తెలిపారు. ఈ సంవత్సరంలో జిల్లాలో వరి ధాన్యం దిగుబడి అంచనా సుమారు 1 లక్ష 50 వేల మెట్రిక్ టన్నుల నుండి 2 లక్షల మెట్రిక్ టన్నుల వరకు వచ్చే అవకాశం ఉందని, కొనుగోలు కేంద్రాలలో వరి శుభ్రపరిచే యంత్రాలను ఏర్పాటు చేసి, రైతులకు సౌకర్యవంతమైన వాతావరణం కల్పించాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాలలో హమాలి చార్జీలకు సంబంధించి ఎటువంటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని తెలిపారు. రవాణా గుత్తేదారులతో కుదుర్చుకున్న ఒప్పందాలు పూర్తైన తరువాత మాత్రమే రవాణా చార్జీలు చెల్లించబడతాయని తెలిపారు. జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను సజావుగా నిర్వహించి, రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సమయానికి సేవలు అందేలా సహకార శాఖ, సంబంధిత విభాగాలు సమన్వయంతో పని చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కాంపిటేటివ్ విద్యార్థులకు పుస్తకాల విరాళం

బెల్లంపల్లి, మే 06, ప్రభాతవార్త

బెల్లంపల్లి పట్టణంలోని కాళోజీ శాఖ గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థుల కోసం నూతన కాంపిటేటివ్ పుస్తకాలను తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు రేణికుంట్ల ప్రవీణ్ బుధవారం రోజున అందజేశారు. ఇటీవల ప్రపంచ పుస్తక దినోత్సవం సందర్భంగా గ్రంథాలయాన్ని సందర్శించిన సమయంలో, అక్కడ చదువుతున్న అభ్యర్థులు తాజా ఎడిషన్ పుస్తకాల కొరతను తెలియజేశారు. ముఖ్యంగా ప్రభుత్వ ఉద్యోగాల కోసం ప్రిపేర్ అవుతున్న విద్యార్థులు ప్రస్తుత ట్రెండ్‌కు అనుగుణంగా అప్డేట్ అయిన పుస్తకాలు అవసరమని కోరారు. ఈ నేపథ్యంలో వారి అవసరాలను దృష్టిలో ఉంచుకుని, విద్యార్థులు సూచించిన పుస్తకాల జాబితాను సేకరించి, నూతన ఎడిషన్‌లను ప్రత్యేకంగా తెప్పించి గ్రంథాలయానికి విరాళంగా అందజేయడం జరిగింది. ఈ పుస్తకాలలో వివిధ పోటీ పరీక్షలకు సంబంధించిన మెటీరియల్ ఉండటంతో విద్యార్థులకు ఎంతో ఉపయోగపడనుంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదువుతున్నప్పటికీ సరైన పాఠ్యపుస్తకాలు అందుబాటులో లేకపోతే వారి ప్రగతి దెబ్బతింటుందని తెలిపారు. అలాంటి పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని గ్రంథాలయాలను మరింత బలోపేతం చేయడం అవసరమని అన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. గ్రంథాలయ నిర్వాహకులు ఈ సహాయంపై కృతజ్ఞతలు తెలిపారు. కొత్త పుస్తకాలతో గ్రంథాలయం మరింత ఉపయోగకరంగా మారిందని, ఎక్కువ మంది విద్యార్థులు దీని ద్వారా లాభపడతారని చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానికులు, విద్యార్థులు, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.



## మందమర్రి కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడిగా మంద తిరుమలరెడ్డి నియామకం

మందమర్రి, మే 06, ప్రభాతవార్త



కాంగ్రెస్ పార్టీ మందమర్రి పట్టణ అధ్యక్షుడిగా మంద తిరుమలరెడ్డిని నియమించినట్లు మంత్రి వివేక్ వెంకటస్వామి ప్రకటించారు. ఈ మేరకు అధికారిక ప్రకటనను విడుదల చేశారు. పార్టీ బలోపేతం, స్థానిక స్థాయిలో కార్యకలాపాల విస్తరణ లక్ష్యంగా ఈ నియామకం చేపట్టినట్లు పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. కొత్తగా బాధ్యతలు స్వీకరించిన మంద తిరుమలరెడ్డి మాట్లాడుతూ, పార్టీ బలోపేతానికి శక్తి మేరకు కృషి చేస్తానని తెలిపారు. పట్టణ ప్రజల సమస్యల పరిష్కారానికి కట్టుబడి పనిచేస్తానని, ప్రతి కార్యకర్తతో సమన్వయంతో ముందుకు సాగుతూ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. మంత్రి వివేక్ వెంకటస్వామి తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని, పార్టీ ఆశయాల సాధనకు అంకితభావంతో పనిచేస్తానని ఆయన స్పష్టం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మంద తిరుమలరెడ్డికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయన నాయకత్వంలో మందమర్రిలో కాంగ్రెస్ పార్టీ మరింత అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



మార్కెట్ యార్డు గోదామును తనిఖీ చేస్తున్న జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా

## ధాన్యపు సంచులను భద్రంగా నిల్వ చేయాలి

నిర్మల్, మే 06, ప్రభాతవార్త

పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డు గోదామును జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. గోదాములో ధాన్యం డంపింగ్ తీరును పరిశీలించిన ఆయన, లారీల ద్వారా వచ్చిన ధాన్యపు సంచులను వెంటనే అన్‌లోడ్ చేసి భద్రపరచాలని ఆదేశించారు. డంపింగ్ ప్రక్రియ వేగవంతం చేసేందుకు హమాలీల సంఖ్యను పెంచాలని సూచించారు. అనంతరం సమీపంలోని వరి, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను పరిశీలించి, రైతులకు ఇబ్బందులు కలగకుండా సేకరణ పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, అధికారులు రాజేందర్, సుధాకర్, తహసిల్దార్ రాజు, మార్కెట్ కమిటీ ఛైర్మన్ భీమ్ రెడ్డి పాల్గొన్నారు.



సాగు మెళకువలపై అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త డాక్టర్ సుధాంశు, బ్యాంక్ మేనేజర్ వేణు ప్రసాద్

## రాయిగూడలో రైతు అవగాహన సదస్సు

సిరికొండ, మే 06, ప్రభాతవార్త:

ఆదిలాబాద్ జిల్లా సిరికొండ మండలంలోని రాయిగూడ గ్రామంలో శాస్త్రవేత్తల ఆధ్వర్యంలో రైతు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏఆర్ఎస్ శాస్త్రవేత్త డాక్టర్ సుధాంశు, టీజీబీ బ్యాంక్ మేనేజర్ వేణు ప్రసాద్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ సుధాంశు మాట్లాడుతూ రైతులు నూనెగింజల సాగుపై దృష్టి సారించాలని, పంట మార్పిడి పద్ధతిని పాటించాలని సూచించారు. కంది, సోయాబీన్ పంటల్లో స్వల్పకాలిక రకాలను వాడాలని, సేంద్రీయ వ్యవసాయం వైపు మొగ్గు చూపాలని కోరారు. అనంతరం బ్యాంక్ మేనేజర్ వేణు ప్రసాద్ మాట్లాడుతూ రైతులు తీసుకున్న రుణాలకు సకాలంలో వడ్డీ చెల్లించి, తిరిగి రుణాలు పొందాలని వివరించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి శ్రద్ధా రాణి, ఏఈఓ ప్రవీణ్ కుమార్, సర్పంచ్, రైతులు పాల్గొన్నారు.

## మొక్కజొన్న కొనుగోలు చేయాలని రైతుల ధర్నా

నర్సాపూర్(జి), మే 06, ప్రభాతవార్త:

తమ మొక్కజొన్న పంటను ప్రభుత్వం తక్షణమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ రైతులు బుధవారం ధర్నా చేపట్టారు. మండలంలోని గుండంపల్లి ఎక్స్ రోడ్డు వద్ద రాంపూర్, గున్నంపల్లి, టెంబుర్ని గ్రామాలకు చెందిన రైతులు రహదారిపై బైఠాయించారు. ఈ సందర్భంగా తక్కల రమణారెడ్డి మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణ వేగవంతం చేయాలని, రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



మొక్కజొన్న కొనుగోలు చేయాలని ధర్నా చేస్తున్న రైతులు



డీఎస్పీని సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు

## ఆసిఫాబాద్ నూతన డీఎస్పీని కలిసిన ప్రజా ప్రతినిధులు

**ఆసిఫాబాద్, మే 6, ప్రభాతవార్త :**

ఆసిఫాబాద్ నూతన డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన బి. అశోక్ ను బుధవారం ఆసిఫాబాద్ మున్సిపల్ చైర్మన్ ఆకాష్, వైస్ చైర్మన్ ఎండీ అహ్మద్, సింగిల్ విండో చైర్మన్ అలీ బీన్ అహ్మద్ లు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కౌన్సిలర్లు కలిసి డీఎస్పీని శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు బాలకృష్ణ, సాలం బీన్ అహ్మద్, మాజీ సర్పంచ్ బలరాం నాయక్, బీఆర్ఎస్ నాయకులు సయ్యద్ నిసార్, సాయి శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.



వాలీబాల్ కిట్ అందజేస్తున్న సర్పంచ్ సులోచన

## యువకులకు వాలీబాల్ కిట్స్ అందజేత

**పెంచికల్‌పేట్, మే 6, ప్రభాతవార్త :**

మండలంలోని కమ్మర్గం, నందిగామ్, గ్రామాల్లో యువతలో క్రీడా స్ఫూర్తి పెంపోందించేందుకు సర్పంచ్ కొండ్రా సులోచన కృషి చేస్తున్నారు. ఈ సందర్భంగా గ్రామ యువకులకు వాలీబాల్ కిట్స్ ను బుధవారం అందజేశారు. యువత క్రీడల్లో చురుకుగా పాల్గొనడం ద్వారా శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ, ఐక్యత పెరుగుతాయాని సర్పంచ్ తెలిపారు. గ్రామ అభివృద్ధిలో యువత పాత్ర కీలకమని, వారు సమాజానికి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబానికి అండగా కాంగ్రెస్ నాయకులు

**పెంచికల్‌పేట్, మే 6, ప్రభాతవార్త :**

మండలంలోని అగర్ గూడ గ్రామానికి చెందిన ఆలం పోశాలు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బుధవారం భాధిత కుటుంబాన్ని స్థానిక కాంగ్రెస్ నాయకులు పరామర్శించారు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నా కుటుంబానికి 25 కిలోల బియ్యం, 5 లీటర్ల వంటనూనెను అందజేశారు. భవిష్యత్ లో కుటుంబానికి అండగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్యకర్తలు, పాల్గొన్నారు.



బియ్యం, నూనె అందజేస్తున్న నాయకులు

# ప్లాస్టిక్ నిషేధానికి ప్రజలే ముందుండాలి

● అదనపు కలెక్టర్ పి. చంద్రయ్య

**బెల్లంపల్లి, మే 06, ప్రభాతవార్త**



ప్లాస్టిక్ వాడకం నిషేధంపై ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు రావాలని జిల్లా అదనపు కలెక్టర్ పి. చంద్రయ్య పిలుపునిచ్చారు. బుధవారం రోజున కాసిపేట మండలం తాటిగూడ గ్రామపంచాయతీని జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్ రావుతో కలిసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలోని రహదారులు, మురుగు కాలువలు, ఓపెన్ వెల్స్, సామాజిక ఇంకుడు గుంతలను పరిశీలించారు. గ్రామంలో ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడంలో ప్రజలు చురుకుగా పాల్గొనాలని సూచించారు. ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన పెంపుతో పాటు, పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని ఆయన పేర్కొన్నారు. గ్రామంలో జరుగుతున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. అలాగే ఉపాధి హామీ పథకం కింద కూలీల సంఖ్య పెంచి, వారికి పూర్తి పని దినాలు కల్పించాలని సూచించారు. తాటిగూడ గ్రామంలో శుభకార్యాలు, చిన్న కార్యక్రమాలకు స్టీల్, అల్యూమినియం, ఇత్తడి వస్తువులను మాత్రమే వినియోగిస్తున్న విషయాన్ని తెలుసుకుని, గ్రామపంచాయతీ సర్పంచ్, కార్యదర్శిని ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం గట్రావుపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని సాలేగూడ గొండ్వానా రాయి సెంటర్‌ను సందర్శించి, అమరవీరుడు కొమురంభీమ్‌కు నివాళులు అర్పించారు. అక్కడ నిర్వహించిన ముఖాముఖ కార్యక్రమంలో గ్రామస్థులతో చర్చలు జరిపి, రాయి సెంటర్ విధివిధానాలు, ఉపాధి హామీ పనులపై సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ సునీల్, ఎంపీడీవో సత్యనారాయణ సింగ్, మండల పంచాయతీ అధికారి సఫ్దర్ అలీ, పంచాయతీ కార్యదర్శి మోనిక, తాటిగూడ సర్పంచ్ మడావి వెంకటేష్, ఉపసర్పంచ్ తమ్మినేడి విజయలక్ష్మి, శ్యామ్ శేఖర్, రాయి సెంటర్ కమిటీ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.



## బ్యాంకు పథకాలను రైతులు వినియోగించుకోవాలి

### - వ్యవసాయ శాఖ ఏడీఏ రాజనరేందర్

**తాండూర్, మే 6, ప్రభాతవార్త :**

బ్యాంకు అందించే పథకాలు రాయితీలను రైతులు వినియోగించుకోవాలని వ్యవసాయ శాఖ ఏడిఏ రాజ నరేందర్ అన్నారు. తాండూర్ మండలంలోని కొత్తపల్లి రైతు వేదికలో బుధవారం బ్యాంకర్లతో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం బ్యాంకులు అనేక పథకాలు అమలు చేస్తున్నాయన్నారు. రైతులకు రుణ సౌకర్యాలు, పంట రుణాలు, కిసాన్ క్రెడిట్ కార్డులు, వడ్డీ రాయితీ పథకాలు, బీమా సౌకర్యాలపై బ్యాంక్ అధికారులు రైతులకు అవగాహన కల్పించారు. రైతులు బ్యాంకుల నుంచి పొందే ప్రయోజనాలు, దరఖాస్తు విధానంపై వివరించారు. వ్యవసాయ శాఖ, బ్యాంకు అధికారులను రైతులు తమ సందేహాలను అడిగి నివృత్తి చేసుకున్నారు. కార్యక్రమంలో గోపాల్ నగర్ సర్పంచ్ గాట్ల నర్సయ్య, సహకార సంఘం సిఇఓ అనిల్ కుమార్, యూనియన్ బ్యాంక్, ఎస్బిఐ, తెలంగాణ గ్రామీణ బ్యాంక్ అధికారులు, సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## కూలర్ కరెంట్ షాక్‌తో బాలుడికి గాయాలు

**ఆసిఫాబాద్ టౌన్, మే 6, ప్రభాతవార్త :**




ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తగిలి ఒక బాలుడు గాయపడ్డాడు. వివరాల్లోకి వెళితే ఆసిఫాబాద్ మండలంలోని బనార్ గొంది గ్రామానికి చెందిన ఆత్రం మారు కుమారుడు ఆత్రం అజయ్ తన ఇంట్లో కూలర్ ఆన్ చేస్తుండగా ఒక్కసారిగా విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. దీనిని గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం బాలుడుని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ విషయం తెలుసుకున్న ఆసిఫాబాద్ మున్సిపల్ వైస్ చైర్మన్ ఎండీ అహ్మద్ జిల్లా ఆసుపత్రికి చేరుకుని బాధితుడిని పరామర్శించారు. అనంతరం డ్యూటీలో ఉన్న వైద్యులతో మాట్లాడి బాలుడికి మెరుగైన చికిత్స అందించాలని కోరారు. ఆందోళనలో ఉన్న బాలుడి కుటుంబ సభ్యులతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పారు. ప్రస్తుతం అజయ్‌కు వైద్యం అందుతోందని, ప్రమాదం ఏమీ లేదని వైద్యులు స్పష్టం చేయడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట పలువురు నాయకులు ఉన్నారు.

## కెరమెరి ఉపాధి హామీ ఉద్యోగుల తాత్కాలిక తొలగింపు

### - జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి దత్తారావు

**ఆసిఫాబాద్, మే 6, ప్రభాతవార్త :**

జిల్లాలోని కెరమెరి మండలం కేస్లాగూడ గ్రామంలో చేపట్టిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల నిర్వహణలో నిరక్ష ్యం వహించిన ఉపాధి హామీ మండల అదనపు ప్రోగ్రాం అధికారి జి. మల్లయ్య, ఇద్దరు సాంకేతిక సహాయకులు బి. అక్యా నాయక్, ఆడే అరవింద్ లను తాత్కాలికంగా విధుల నుండి తొలగించినట్లు జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి దత్తారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కెరమెరి మండలంలోని కేస్లాగూడ గ్రామంలో చేపట్టిన పర్కులేషన్ ట్యాంక్ నిర్మాణంలో పలువురు కూలీలు హాజరు కాకున్నా హాజరు అయినట్లుగా నమోదు చేసిన దానిపై వచ్చిన ఫిర్యాదు మేరకు అసిస్టెంట్ విజిలెన్స్ అధికారితో గ్రామంలో విచారణ జరిపించి సిబ్బంది నిరక్ష్యం వహించినట్లుగా నివేదిక సమర్పించడంతో తదుపరి ఆదేశాలు వచ్చే వరకు ఉపాధి హామీ విధుల నుండి తాత్కాలికంగా తొలగించడం జరిగిందని తెలిపారు. ఇంచార్జ్ ప్రోగ్రాం అధికారిగా వలిపిరెడ్డి నగేష్, ఇంజనీరింగ్ కన్సల్టెంట్ గా నాగోరావు వ్యవహరిస్తారని తెలిపారు.

## పిఏసిఎస్ చైర్మన్‌గా జాబోరే పెంటయ్య బాధ్యతల స్వీకరణ

**వాంకిడి, మే 6, ప్రభాతవార్త :**

ప్రాథమిక సహకార సంఘాల పదవీకాలాన్ని ప్రభుత్వం పోడగించిన నేపథ్యంలో వాంకిడి పిఏసిఎస్ చైర్మన్‌గా జాబోరే పెంటయ్య బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల సంక్షేమ మే ధ్యేయంగా ఎరువులు, విత్తనాలు, రుణాలు అందేలా సకాలంలో కృషి చేస్తానని పేర్కొన్నారు. చైర్మన్ గా పదవి బాధ్యతలు స్వీకరించిన పెంటయ్య కు వాంకిడి సర్పంచ్ చునర్కర్ సతీష్, సారండీ సర్పంచ్ నేపాజి, బాంబర సర్పంచ్ బెండరే క్రిష్టాజీ, మాజీ సారండీ సర్పంచ్ దుర్గం కమలాకర్, డైరెక్టర్ గొల్ల, దిగంబర్, చెప్లే సీతారాం పాటేల్, సి ఈ ఓ ఒమాజీ, సుధాకర్, రైతులు అభినందించారు.



శాలువాతో సన్మానిస్తున్న వివిధ గ్రామాల సర్పంచులు